## మేడ్చల్‌లో కరాటే పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి

మేడ్చల్: మేడ్చల్‌కు చెందిన యూనివర్సల్ 369 షాటోఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి ప్రారంభించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఆరు రాష్ట్రాలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ విద్యను ప్రదర్శించారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని, మార్షల్ ఆర్ట్స్, కరాటే వంటి పోటీల్లో పాల్గొనేందుకు తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చట్ పూజ



మేడ్చల్: దీపావళి తర్వాత ఉత్తర భారతీయులు ఘనంగా జరుపుకునే చట్ పూజా కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి బుడమకుంట వద్ద ఆదివారం ఉదయం సూర్యోదయానికి ముందు, సాయంత్రం సూర్యాస్తమయానికి ముందు గంగమ్మతల్లి వద్ద పూజలు చేశారు. పసుపు కుంకుమ, చెరుకు వంటి వస్తువులతో పూజలు చేసి గంగమ్మకు హారతులు ఇచ్చారు. రెండు రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన మహిళలు ప్రతీ సంవత్సరం చట్ పండగను ఘనంగా జరుపుకుంటున్నారు.

## పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలీలు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని వ్యవసాయ క్షేత్రంలో సమావేశమై సంఘం సమస్యలపై చర్చించారు. పద్మశాలీల అభివృద్ధి కోసం ప్రణాళికలు తయారు చేసి వాటిపై చర్చించారు. సమ్మేళనానికి హాజరైన పద్మశాలీ మహిళలకు సంఘం తరపున చీరలను పంపిణీ చేశారు. రాజకీయాలకు తావు లేకుండా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు జనార్దన్, నాయకులు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆలోచనా విధానం గొప్పది



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తూ..

ఘట్‌కేసర్: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానం ఎంతో గొప్పదని ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్ కమల్ మహారాజ్ అన్నారు. ప్రబుద్ధ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు పూలమాల కార్యక్రమాన్ని ఘట్‌కేసర్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘ ప్రతినిధులు మేకల దాస్, పాండుగౌడ్, నవీన్ మహారాజ్, శివ, మాధవ్, నిఖిల్, నవీన్ కుమార్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# 3న బీఆర్‌ఎస్ అరాచక పాలన అంతం



కాంగ్రెస్‌లో చేరుతున్న కీసర, రాంపల్లికి చెందిన నేతలు, యూత్ సభ్యులతో అభ్యర్థి వజ్రేష్‌యాదవ్

- మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్
- శామీర్‌పేట, కీసర మండలాల్లో భారీగా చేరికలు

మేడ్చల్ జోన్ బృందం: ఈ నెలాఖరుతో తెలంగాణలో బీఆర్‌ఎస్ అరాచక పాలన అంతమవుతుందని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. కీసర మండలానికి చెందిన పలువురు నాయకులు భారీ సంఖ్యలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ప్రజలంతా ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ నేతలంతా సమష్టిగా కృషి చేయాలని కోరారు. అమ్మ సోనియాగాంధీ ఇచ్చిన 6 గ్యారంటీలు నిరుపేదల అభివృద్ధికి దోహదపడతాయని, ఎన్నికల హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు.

**కాంగ్రెస్‌లో భారీ చేరికలు..**

కీసర, శామీర్‌పేట మండలాల్లో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. కీసర మండల వైస్ ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి, కీసర ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ కందాడి బాలమణి ప్రభాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు నర్సింహచారిల ఆధ్వర్యంలో సుమారు 150 మంది కీసర గ్రామస్తులు, రాంపల్లికి చెందిన కౌన్సిలర్ పంబాల సరితారమేష్ ఆధ్వర్యంలో శివగణేష్ యూత్‌కు చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరారు. శామీర్‌పేట మాజీ సర్పంచ్, ఎంపీటీసీ దప్పు సాయి ఆధ్వర్యంలో సుమారు 100 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న శామీర్‌పేట మాజీ సర్పంచ్ కిషోర్‌యాదవ్



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ప్రచారం చేస్తున్న నేతలు

**విస్తృతంగా ప్రచారం..**

ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 9, 10వ వార్డుల్లో కౌన్సిలర్ శశికళ దేవేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్ప శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్, కీసర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, కౌన్సిలర్లు పంబాల సరితారమేష్, పంగహరి బాబు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో బీఆర్‌ఎస్ జోరుగా ప్రచారం

మంత్రి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి



కీసరలో ప్రచారం...



మంత్రికి హారతి ఇస్తున్న మహిళలు



పార్టీలో చేరిన వారితో మల్లారెడ్డి

మేడ్చల్ జోన్ బృందం: మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ కార్పొరేషన్లు, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మూడుచింతలపల్లి, మేడ్చల్, శామీర్‌పేట్, కీసర ఘట్‌కేసర్ మండలాల్లోని గ్రామాల్లో నాయకులు జోరుగా ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లినా ప్రజలు బీఆర్‌ఎస్‌కు, మంత్రి మల్లారెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి మల్లారెడ్డి చేసిన అభివృద్ధి పనులతో ఓటర్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. మల్లారెడ్డిని మరోసారి గెలిపించి ఆయన రుణం తీర్చుకుంటామని అన్నారు. మంత్రి మల్లారెడ్డి తన సొంత ఖర్చులతో ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో సీసీ రోడ్లు వేయించారని, నియోజకవర్గంలో ప్రజలకు రోడ్ల సమస్య లేకుండా చేశారని, మిషన్ భగీరథ ద్వారా ప్రజల దాహార్తిని తీర్చారని అన్నారు.

**ఆత్మీయ సమ్మేళనాలు..**

నియోజకవర్గంలోని బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో పలు డివిజన్లలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి పాల్గొని ప్రజలతో కలిసిపోయారు. ప్రజలకు తాను చేసిన సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ఆయన వివరించారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తానని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఘట్‌కేసర్‌లో నిర్వహించిన యాదవ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరికలు..**

నియోజకవర్గంలోని మూడు చింతలపల్లి, శామీర్‌పేట్, ఘట్‌కేసర్ మండలాలకు చెందిన పలు గ్రామాల యువకులు, ఇతర పార్టీల నాయకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బోడుప్పల్ 14వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రచారంలో మున్సిపల్ చైర్మన్లు లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, దీపికనర్సింహరెడ్డి, పావనిజంగయ్య, చంద్రారెడ్డి, కొండల్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, ప్రణీత శ్రీకాంత్, మేయర్లు కావ్య, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంతోషంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పోచారం: ఘట్‌కేసర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1982–83 విద్యా సంవత్సరం ఎస్ఎస్‌సీ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం అన్నోజిగూడలోని వీడీఆర్ రెసిడెన్సీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థుల గురువులు మాట్లాడుతూ.. జీవితంలో చెరగని ముద్ర వేసేది పదో తరగతి వరకు చదువుకున్న దోస్తులు, వారి జ్ఞాపకాలేనని పేర్కొన్నారు. దోస్తులంతా ఒకే వేదికపై కలిస్తే వారిలో కలిగే ఆనందానికి అవధులుండవన్నారు. స్నేహితులు ఎవరైనా ఆపదలో ఉంటే ఆదుకోవాలని, ఆ దిశగా సమ్మేళనాలు దోహదపడాలని ఆకాంక్షించారు. స్నేహితుల కలయికతో వచ్చే సంతోషం గొప్పగా ఉంటుందన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు కడుపోల్ల ఈశ్వర్, ఆర్గనైజర్లు బద్దం వెంకట్‌రెడ్డి, వి.నాదంగౌడ్, నారాయణ, పోలగోని కుమార్, అలివేణి, జయ మేరి, సుజాత, రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల మద్దతు 23న ప్రకటిస్తాం

మల్లాపూర్: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సమావేశాన్ని నాచారం టీయూజేఏసీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా టీయూజేఏసీ ఉప్పల్ నియోజకవర్గ చైర్మన్ నల్లా రాధకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమం కోసం ఏ పార్టీ మ్యానిఫెస్టో అనుకూలంగా ఉందో చూసి వారికి 23వ తేదీన మద్దతు ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కనుకుంట్ల విజయ్‌కుమార్, వినోద్‌కుమార్, కరుణాసాగర్ బాలజీనాయక్, శివ, పద్మారావు ముదిరాజ్, క్రిష్ణ, మధు, సతీష్, లింగస్వామి, నజీర్, అశోక్‌కుమార్, చిన్నరాములు తదితరులు పాల్గొ న్నారు.

## కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గౌడవెల్లి సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా సోమవారం పలు గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్‌చంద్ తెలిపారు. గౌడవెల్లి, బాసిరేగడి, జ్ఞానాపూర్‌లలో అన్ని డొమస్టిక్, ఇండస్ట్రియల్ సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

## నేడు కార్నర్ మీటింగ్‌లు

మేడ్చల్: బీఆర్‌ఎస్ ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్న పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్ తెలిపారు. మండలంలోని సోమారం, ఎల్లంపేట్, సైదనిగడ్డతండా రావల్‌కోల్ గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తుండగా వాటిల్లో మంత్రి మల్లారెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

సుభాష్‌నగర్: దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన వీర వనిత దివంగత ప్రధాని ఇందిరా గాంధీ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి ఉత్సవాలను కుత్బుల్లాపూర్ బీ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సొంటిరెడ్డి చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంటరీ ఇంచార్జ్ దీపఅనిల్ , మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇందిరా గాంధీ హయాంలోనే మహిళలు అన్ని రంగాల్లో రాణించారన్నారు. ఇందిరమ్మ రాజ్యం సాధించే దిశగా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

## 22 నుంచి అన్న సమారాధన

చింతల్: అయ్యప్పస్వాముల దీక్ష ప్రారంభమైన నేపథ్యంలో నవంబర్ 22 నుంచివచ్చే ఏడాది జనవరి 3వ తేదీ వరకు భగత్‌సింగ్‌నగర్ ధర్మశాస్త సేవాసమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ధర్మశాస్త సేవాసమితి అధ్యక్షుడు భూనేటి రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అయ్యప్పస్వామి దీక్ష చేపట్టిన ప్రతి అయ్యప్ప ఇక్కడ సమారాధనలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సమాప్రాధన కార్యక్రమం చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం, హరిహర క్షేత్రంలో ఈ వసతిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 26న అయ్యప్ప పడిపూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9059663440, 9949236133 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## మహిళా కవి సమ్మేళనం

నిజాంపేట్:జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. మహిళా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి ఘూటా మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కవయిత్రి లక్ష్మి పుస్తకం 'మన తెలుగు'గ్రాంథాన్ని, అరుణకుమారి 'అరుణారుణా కిరణాలు'పుస్తకం ఆవిష్కరించారు.

## ఆర్టీసీ కార్తీక మాస ప్రత్యేక సర్వీసులు

కాప్రా: కార్తీక మాసం సందర్భంగా భక్తులు పుణ్యక్షేత్రాల సందర్శన సౌకర్యార్థం కుషాయిగూడ ఆర్టీసీ డిపో తరపున ప్రత్యేక సర్వీసులను ఆదివారం ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. డిసెంబర్ 18 వరకు కార్తీక దర్శిని 1, 2 ప్రత్యేక సర్వీసులు ప్రతి శని, ఆది, సోమవారాల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కార్తీక దర్శిని–1 ద్వారా ముచ్చింతల్, కొత్తూరు ఆనందపద్మనాభ ఆలయం, షాద్‌నగర్ రామేశ్వర ఆలయం, వెండికొండ సిద్ధలింగేశ్వర ఆలయం, కార్తీక దర్శిని–2 ద్వారా చీర్యాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అలియాబాద్ రత్నాలయం, మేడ్చల్ బద్రీనాథ్ ఆలయం, వర్గల్ సరస్వతీ ఆలయం, కొమవెల్లి మల్లన్నస్వామి ఆలయం, కొండపోచమ్మ ఆలయం, కీసరగుట్టకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. దర్శిని–1 సర్వీసులో పెద్దలకు రూ.600, పిల్లలకు రూ.400, దర్శిని–2లో పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300 మాత్రమే నిర్ధారించినట్లు తెలిపారు. కనీసం 30 మంది ఉంటే వారున్న కాలనీకే బస్సును పంపనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 99592 26145, 83339 75940. ప్రత్యేక సర్వీసుల కోసం ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ఘట్‌కేసర్: చిన్న గొడవతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌లోని సాయినగర్ కాలనీకి చెందిన గుర్రం గాంధీ(38) తన స్నేహితులు రత్నరాజు, సురేష్‌తో కలిసి మాస్టర్ బేకరీ వెనుక ఉన్న సురేష్ ఇంట్లో పార్టీ చేసుకున్నారు. బిర్యానీ ఖాళీ కవర్లను పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో సురేష్ వేయడంతో అక్కడ పనిచేస్తున్న వారు తిట్టారు. విషయాన్ని తన స్నేహితులకు చెప్పడంతో వారంతా వచ్చి పనివాళ్లతో గొడవ పెట్టుకున్నారు. చుట్టుపక్కల వాళ్లు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. గాంధీ ఇంటికెళ్లిన కొద్ది సేపటి తర్వాత బాత్‌రూంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘట్‌కేసర్‌లోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కార్తీక వనభోజనం.. పండుగ వాతావరణం

చింతల్: చింతల్ డివిజన్ హెచ్‌ఎంటీకాలనీలో ఆదివారం పండుగ వాతావరణం నెలకొంది. కార్తీక మాసం పురస్కరించుకుని హెచ్‌ఎంటీకాలనీలోని పలు ప్రాంతాలలో కార్తీక మాస వనభోజనాలను నిర్వహించారు. హెచ్‌ఎంటీ కాలనీలోని వేంకటేశ్వరకాలనీలోని హరిహర మండపంలో శెట్టిబలిజ కులస్తుల వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్, కేఎం ప్రతాప్‌లు హాజరై శెట్టి బలిజ కులస్తులకు అండగా ఉంటామన్నారు. అనంతరం వచ్చే ఎన్నికల్లో తమకే మద్దకు తెలపాలని కోరారు. వనభోజనాల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.

- అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో హెచ్‌ఎంటీ కాలనీలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కండిబోయిన శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు దొంగ సంహచలం, గుబ్బల వీరం శెట్టి, ప్రధాన కార్యదర్శి పిచ్చెట్టి సత్యనారాయణ, ట్రెజరర్ కట్టా సత్యనారాయణ మూర్తి, అడ్వైజర్ చిట్టూరి సూర్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్లు మట్టమర్తి రామదాసు, వాసంశెట్టి విద్యాసాగర్, సంఘం నేతలు పాల్గొన్నారు. అదేవిధంగా నల్లపోచమ్మ దేవాలయ ప్రాంగణంలో భాగ్యనగర్ కొప్పుల వెలమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు.

## కుత్బుల్లాపూర్ గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

చింతల్: కుత్బుల్లాపూర్ గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కుత్బుల్లాపూర్‌లోని వేణుగోపాలస్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అధ్యక్షుడిగా కూన రాజకుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మద్దెల గోమేష్‌గౌడ్, నల్ల ప్రసాద్ గౌడ్, బాసుపల్లి వ్యాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కూన శ్రీనివాస్ గౌడ్, బాసుపల్లి సందీప్ గౌడ్, అడ్వైజర్లుగా నల్ల లింగం గౌడ్, కూన శ్రీనివాసులు గౌడ్, కూన సుధాకర్ గౌడ్, మద్దెల జయరాజు గౌడ్, లీగల్ అడ్వైజర్‌గా నల్ల చంద్రశేఖర్‌గౌడ్, ట్రెజరర్‌గా కూన ఆంజనేయులు గౌడ్లతో పాటు సంయుక్త కార్యనిర్వాహక సభ్యులను, ఇతర కార్యవర్గ మెంబర్లను ఎన్నుకున్నారు.

# పోలింగ్ పోటెత్తేలా కసరత్తులు!

- ఓటర్లను కలుస్తూ అవగాహన కల్పిస్తూ..
- ముమ్మరంగా చీటీల అందజేత
- ఆదివారం నాటికి లక్ష పైచిలుకు పంపిణీ
- 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటేసే అవకాశం



ఓటరు స్లిప్పులను అందజేస్తున్న సిబ్బంది

సనత్‌నగర్: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు రంగంలోకి దిగారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గత రెండు పర్యాయాలు పోలింగ్ శాతం 60 శాతం దాటలేదు.. ప్రతిసారి ఓటింగ్ శాతం తగ్గుతూ వస్తుండడం గమనార్హం. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గంలో 56.45 శాతం పోలింగ్ జరగ్గా.. 2018లో 52 శాతానికి పడిపోయింది. ఈ దఫా ఎన్నికల్లో ఎలాగైనా పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల విషయంలో ఓటర్లు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ఉండేలా స్లిప్పుల పంపిణీ చేపడుతున్నారు. ఆదివారం నాటికి లక్ష పైచిలుకు ఓటర్లకు స్లిప్పులను పంపిణీ చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

**పోలింగ్ బూత్‌లో క్యూ పరిస్థితిని తెలుసుకుని మరీ..**

పోలింగ్ రోజు బూత్‌లలో క్యూ పరిస్థితి ఎలా ఉంటుందో ఇంటి వద్దనే ఉండి తెలుసుకునే వెసులుబాటును కల్పించారు. ఓటరు స్లిప్పులో ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పోలింగ్ బూత్‌ల వివరాలతో పాటు అక్కడి స్టేటస్ ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. బూత్‌లలో రద్దీని తెలుసుకుని ఆ మేరకు ఎక్కువ సేపు క్యూలైన్లలో నిలబడకుండా ఓటు హక్కు వినియోగించుకుని వెళ్లొచ్చు.

**కీలకంగా బీఎల్‌ఓల పాత్ర..**

ఇదే క్రమంలో పోలింగ్ శాతాన్ని పెంచడంలో బీఎల్‌ఓల పాత్ర కీలకంగా మారనుంది. బీఎల్‌ఓలు తమ పరిధిలోని ఓటర్లను గుర్తించడంతో పాటు ఓటర్లు సైతం తమ బీఎల్‌ఓలను గుర్తించేలా ఇప్పటికే వివిధ రూపాల్లో ఓటర్లను బీఎల్‌ఓలను కలుసుకోవడం జరిగింది. నియోజకవర్గంలో 249000 ఓటర్లకు గాను 229 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక్కో బీఎల్‌ఓ విధులు నిర్వర్తిస్తుంటాడు. వీరంతా తమకు కేటాయించిన పరిధిలో స్లిప్పుల పంపిణీ బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరిని పర్యవేక్షించేందుకు మొత్తం 22 మంది సెక్టోరియల్ అధికారులను నియమించారు. ఒక్కో బీఎల్‌ఓ పరిధిలో సుమారు 200 నుంచి 300 ఇళ్లు ఉంటాయి.

**ఇంట్లోనే వృద్ధులకు ఓటు వేసే అవకాశం..**

80 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంట్లోనే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే బీఎల్‌ఓలకు దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రం వద్దకు రాలేని వారిని ముందుగానే గుర్తించే బాధ్యతలను బీఎల్‌ఓలకు అప్పగించారు. ఒక వేళ రాలేని పరిస్థితిలో ఉన్నవారికి ఫాం12–డీ అందజేసి పూరించిన ఫారాన్ని తిరిగి ఎన్నికల సిబ్బందికి అందించాల్సి ఉంటుంది. పోలింగ్ రోజున ఎన్నికల అధికారి, పోలీస్ సిబ్బంది కలిగిన బృందం వృద్ధుల ఇళ్లకు వెళ్లి బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయించి తీసుకు వస్తారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీస్తారు.

**పోలింగ్ బూత్‌ల వివరాలతో..**

ఓటరుకు సంబంధించిన వివరాలతో పాటు సదరు ఓటరు ఎక్కడ ఓటు వేయాలో తెలియజేసే పోలింగ్ బూత్, ఆ బూత్ ఉన్న భవనం వివరాలతో కూడిన స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. ఇదే క్రమంలో స్లిప్పుల పంపిణీ అనంతరం ఓటరు ఫోన్ నెంబర్‌ను సేకరిస్తున్నారు. ఆయా ఫోన్ నెంబర్ల ఆధారంగా పోలింగ్ రోజు నాటికి మరింత చైతన్యం తీసుకువచ్చే విధంగా ఎస్ఎంఎస్‌ల ద్వారా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. పోలింగ్ రోజు (ఈ నెల 30) మధ్యాహ్నం 12 గంటల వరకు పోలింగ్ శాతాన్ని పరిశీలించిన పిమ్మట అప్పటివరకు తక్కువ పోలింగ్ శాతం నమోదైనట్లయితే ఎవరైతే ఓటు హక్కు వినియోగించుకో లేదో వారి ఇళ్లకు వెళ్లి ఓటు వేసేలా వారిని పోలింగ్ కేంద్రానికి రప్పించే చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. స్లిప్పుల పంపిణీ సమయంలో రాజకీయ పార్టీ నేతలను కూడా అనుమతిస్తున్నారు. అయితే స్లిప్పులు మాత్రం బీఎల్‌ఓలు మాత్రమే అందించాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఓటర్లను ప్రేరేపించేలా ఎలాంటి చర్యలకు ఉపక్రమించినా చర్యలు ఉంటాయి.

**పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యం..**



ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఎన్నికల కమిషన్ తరుపున పోలింగ్ శాతం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. బీఎల్‌ఓలకు దిశా నిర్దేశం చేశాం. ఆ మేరకు ఓటర్లను చైతన్య పరుస్తున్నాం. శనివారం వరకు 61 వేల మంది ఓటర్లకు స్లిప్పులను పంపిణీ చేశాం. ఆదివారం సెలవు దినం కావడంతో ఆ సంఖ్య లక్షన్నర వరకు చేరుకుంటుందని అంచనా.

– కిషన్‌రావు ఆర్ఓ